
# విలువలు

## ఎమ్ హెంచ్ కేశవరావ్




'క్షమించు. నేను నిన్ను పెళ్ళిచేసుకోలేను' అన్నమాట రాకూడదు. వచ్చిందంటే ఎదుటివారికి అది అశనిపాతమే. ఆ స్థితిలో ఎవరికి అయినా మార్గం ఒక్కటే.

---

**వేదికమీద** ఒక్కసారి గజ్జెల సంగీతానికి మృదంగం త్రుళ్ళిపడింది. పిల్లనగ్రోవి మారు పలికింది. వాయులీనం వణికిపోయింది. ఆమె తెర తొలగించి సభలోకి గుచ్చిగుచ్చి చూసింది. కాని, చూపులు శూన్యాన్ని నింపుకుంటున్నయ్. అవును. అతనింక తనకు కనబడడు—ఇంక కనబడడు. కన్నీటి గీతలు కళ్ళల్లో గుచ్చుకున్నయ్.

తెర లేచింది.

సభలో లైట్లు ఆరిపోయినై. గజ్జెల

రవళికి వేదికమీద రంగులు విరజిమ్మబడ్డాయ్. విరహిణి పార్వతి చంద్రశేఖరుని కొరకు కైలాస శిఖరాన్ని అధిరోహిస్తూంది. ఒక చేతిలో పూసెజ్జ. మరొకచేయి నుదుటిపై ఆన్చి, అల్లంతదూరాన, కొండకొమ్మన అతను కనపడతాడేమోనని చూస్తూంది. క్షణాలు నిమిషాలై కాలాన్ని కరుస్తున్నయ్. అతని జాడ లేదు; దోవ తరగడం లేదు. చూసి, చూసి తవులోకి తామే చూసు కునే చూపులతో కళ్ళు వాలిపోతున్నయ్. పాదాలు తడబడుతున్నయ్. కోపం, అంతలోనే విరహం, నిరీక్షణ, నిరాశ గజ్జెల్లో కలిపి నృత్యం చేస్తూంది యామినీదేవి. అత నింక కనబడడు—అవును. అతను ఇంక తనకు కనబడడు. నిరాశలో బ్రతుకు దగ్ధమై, అంతమైపోతున్నది. నృత్యంలో లీనమై, కాలంతో పందెంవేసిన పాదాల చలనానికి గజ్జెలు తడబడి లయలో గతులు తప్పిపోతున్నయ్. ఘల్లు ఘల్లు మనే గజ్జెల రవళితో సభలో ప్రతి అణువూ నిండిపోయింది. నృత్యంతో కాలాన్ని జయించి, సంగీతంలో అనంతాలను తాకి, అన్ని శబ్దాలనూ ఒక్కసారి త్రెంచేసి యామినీదేవి వేదికపై తడబడి ఒరిగిపోయింది.

సభలో కరతాళధ్వనులు మిన్నుముట్టినై, అదికూడ నృత్య భంగిమ అనుకొని.

తెర జారిపోయింది.

ఇంకా కరతాళధ్వనులతో సభ మారు మ్రోగుతూనే ఉంది.

వేదికమీద, తెరవెనుక కలకలం.

మేనేజర్ డాక్టర్ని పిలవడానికి ఫోనుదగ్గరికి పరుగెత్తడం ఎవరూ చూడలేదు.

* * *

గదిలో సన్నగా ఈలపాట పాడుకుంటూ కుంచెను రంగులో ముంచి, ఆమె నల్లటి కళ్లను మరింత సొగగా దిద్దడంలో మునిగిపోయినాడు చంద్రశేఖరం. అతని ముందు యామినీదేవి కేన్వాసుమీద నృత్యం చేస్తూంది. గజ్జెల పాదాలతో అతని హృదయంమీద చెరగని ముద్రలు వేస్తూంది. దూరదూరాన ఎక్కడ మండో వినవస్తున్న ఆ గజ్జెల సంగీతాన్ని వెతుక్కుంటూ ముందుకు పోతున్నాడు అతను. ఇంక కొద్దిదినాల్లో యామిని తన హృదయ రాణి అవుతుంది. తను చిత్రకారుడు, ఆమె నర్తకి—ఇంకేం కావాలి ప్రకృతిలో లీనం కావ డానికి? చంద్రశేఖరం తన భవిష్యత్తుకు రంగులు వేసుకుంటున్నాడు.

యామిని దశరథరామయ్యగారి ఏకైక పుత్రిక. చంద్రశేఖరం దశరథరామయ్యగారి మేనల్లుడు. చెల్లెలు చనిపోతూ దశరథరామయ్య గారి చేతిని తన చేతిలోకి తీసుకొని, 'చంద్రుణ్ణి నీ అల్లుడుగా చేసుకుంటానని మాటియ్యరా అన్నయ్యా'—అని కళ్ళు మూసింది. తల్లి మర ణంతో ఇల్లు విడిచి వెళ్లిన తండ్రిని మళ్ళీ ఇంతవరకూ చూడలేదు చంద్రశేఖరం. దశరథ రామయ్యగారే చంద్రశేఖరాన్ని పెంచారు. అతను స్కూలుఫైనలులోకి వచ్చేవరకు యామినీ,

# విలువలు

చంద్రశేఖరంలు కలిసే చదువుకున్నారు. అతనికి మొదటినుండీ చిత్రలేఖనంలో ఆసక్తి. స్కూల్లో డ్రాయింగ్ మాస్టారి ప్రోత్సాహంతో మామయ్య నడిగి రాజమండ్రి వెళ్లిపోయినాడు, చిత్ర లేఖనం నేర్చుకొనే నిమిత్తం. ఆ తరువాత రెండేళ్లలోనే అతను పత్రికలలో యామిని నృత్య ప్రదర్శనములను గురించిచదివాడు. తక్కిన రెండేళ్ళూ ఆమె, తను కలిసిన భవిష్యత్తుపై వేసుకున్న తైలవర్ణ చిత్రాలలో బ్రతికా డతను. కోర్సు పూర్తి అయిపోగానే మేనమామ ఊరు వచ్చేశాడు చంద్రశేఖరం. వెంటనే అతన్ని ఓ పత్రిక ఆర్టిస్టుగా నియమించింది. తనిప్పుడు సంపాదిస్తున్నాడు; కనుక తన భారం మేనమామకు ఇంకేవిధంగానూ ఉండకూడదని చంద్రశేఖరం పత్రిక ఆఫీసుకు దగ్గరలోనే ఒక మేడమీద గది తీసుకొని ఉంటున్నాడు. అత నిప్పటికీ ఆశ్చర్యపడే విషయ మేమిటంటే— అతని ఊహనుమించి ఈ నాలుగేళ్లలోనూ యామిని ఎంతో మారిపోయింది. ఆమె శరీరంలోని ప్రతి అవయవం నృత్యశిక్షణలో సంపూర్ణత్వాన్ని చేరుకుని సౌందర్యానికే రూపా న్నిస్తున్నది. అతన్ని మరొక విషయంకూడ ఆశ్చర్యపరిచింది. అత నూహించినట్లు ఆమె సిగ్గుపడుతూ, 'బావా, ఎప్పు డొచ్చావు? ఎట్లా ఉన్నావు?' అని గాక, 'చంద్రశేఖరం,బావున్నావా?' అని పలకరించి, జవాబు అయినా ఆశించకుండా తన కారులో ఎక్కి వెళ్లిపోయింది. చంద్ర శేఖరం బాధపడలేదు. యామిని తనను 'చంద్ర శేఖరం' అంటేనే ఎంతోబావుంది అనుకున్నాడు. ఆమె సౌందర్యానికి మాత్రం అతనిలోని 'చిత్ర కారుడు' ఎన్నో కొత్తసంగతులు తెలుసుకున్నాడు.

ఆ తరువాత, చంద్రశేఖరం అప్పుడప్పుడు దశరథరామయ్యగారింటికి వస్తూ ఉండేవాడు. అత్తయ్య, మామయ్య అతన్ని ఎప్పటిమాదిరి గానే చూస్తూ ఉన్నారు. ఆవేళ ఆదివారం—యామి నిని చూసి చాలారోజులైంది. తన కొత్త చిత్ర లేఖనాలు చూపించాలని చంద్రశేఖరం వెళ్ళాడు. క్రింద గదిలో మామయ్య, అత్తయ్యల మాటలు వినిపించాయి.

"ముచ్చట, ముచ్చట అని ఇన్నాళ్ళూ దానిచేత డాన్సు చేయించారు. ఇంకా పెళ్ళంటూ లేదా?" అత్తయ్య అంటూంది. అందుకు మామయ్య నవ్వుతూ— "ఇంక నువ్వెప్పుడనుకుంటే అప్పుడే చెయ్యొచ్చు లేవే. మన మేమైనా పెళ్లికొడుకు కోసం,తిరగాలా ఏమన్నానా" అన్నాడు.

"అంటే?" అత్తయ్య కంఠం ఆశ్చర్యంగా.

"ఏం, తెలీనట్లు అడుగుతున్నావ్? ఇంత కాలమూ చంద్రశేఖరాన్ని అల్లుడు కాదను కుంటున్నావా?" మామయ్య.

గది బయట చంద్రశేఖరం గుండె కాస్సేపు కొట్టుకోవడం ఆగిపోయింది, ఆతరువాత అత్తయ్య మాటవినడం కోసం.

"మీా ఇష్టం నేను కాదంటానా?" అంది అత్తయ్య.

అతను హాల్లోకి వెళ్లి కూచోబోతూంటే దశరథరామయ్యగారు బయటికివచ్చి 'రారా శేఖరం' అని' గదిలోకి తీసుకెళ్లి కూర్చో బెట్టుకొని ఎన్నో విషయాలు మాట్లాడారు. అత్తయ్య అతన్ని పరిశీలనగా చూసినట్లయిం దతనికి. యామిని బీద విద్యార్థుల సహా యార్థం సరోజినీదేవి హాల్లో నృత్యప్రదర్శన ఇవ్వడానికి వెళ్లిందట. ఓగంటసేపు యామిని కోసం ఎదురుచూసి, అత్తయ్య పెట్టిన ఫల హారం పూర్తిచేసి భోజనానికి ఉండమంటున్నా పత్రిక ప్రత్యేకసంచిక పని ఉందంటూ బయట పడ్డాడు శేఖరం.

మండిపోతున్న ఎండ పుచ్చపువ్వులాంటి వెన్నెల్లా ఉంది శేఖరానికి. ఇంక కొద్దికాలానికే యామిని తన భార్య అవుతుంది. అప్పు డింక పత్రికలో పని మానేస్తాడు. ఎక్కడో ఓ గ్రామంలో, ప్రకృతికి మరింత దగ్గరగా ఉండే ప్రాంతానికి వెళ్లిపోతారు. ఆమె తనకు ఆదర్శం అవుతుంది. తన జీవితానికి లయ అవుతుంది. ఇంక ఎన్ని చిత్రలేఖనాలో...

అతను గది చేరుకునేటప్పటికి ఓరిక్షా వెనక్కు తిరిగి వెళ్లిపోబోతూఉన్నది. అతన్నిచూసి రిక్షా లోంచి దిగి యామిని, "నీకోసమే వచ్చా. ఎక్కడి కెళ్లావ్?" అంది. చంద్రశేఖరం ఆశ్చర్యపడక తప్పలేదు. ఆమె సామాన్యంగా తన గదికి రాదు. ఇది రెండోసారి ఆమె తన గదికి రావడం. మొదటి సారి వర్షం కురుస్తూంటే ఆ దారినే వెళ్తూ ఆగింది.

శేఖరం తాళం తీయగానే అతని వెంట గదిలో ప్రవేశించి యామిని,"చూడు శేఖరంబావా, నువ్వు నా కో పని చేసిపెట్టాలి" అంది.

అతను ఏమిటన్నట్లు ఆత్రుతగా చూశాడు.



చెట్టుక్రింద

చిత్రం—పి. జానకీదేవి (అనపర్తి)

"అమ్మ, నాన్న నిన్ను అడుగుతారు నన్ను పెళ్లిచేసుకోమని. నువ్వు నీ కిష్టంలేదని చెప్పాలి."

అతనికి ఆమె ఏంచెప్పుతున్నదో అర్థం కాలేదు మొదట.


"నన్ను క్షమించాలి. నేను నిన్ను పెళ్లి చేసుకోలేను బావా" అంది తిరిగి. అత నేం చెబుతాడోనని ఆమె తల పైకెత్తింది. కాని అప్పటికే అతను శిల అయిపోయాడు. అతను మళ్ళీ స్పృహలోకి వచ్చేటప్పటికి ఆమె రిక్షా ఎక్కేసింది.

"అమ్మయ్య! చెప్పగలిగాను" అనుకుంది యామినీదేవి చెమటను తుడుచుకుంటూ రిక్షాలో. ఈ నల్లటి అందగాణ్ణి కట్టుకుని తనేం సుఖపడగలదు? తను మొదటినుండీ శేఖరాన్ని ప్రేమించడం లేదు. అతను ప్రేమిస్తే అందుకు బాధ్యురాలు కాదే? అతన్ని పెళ్లి చేసుకుంటే తన ఆశయా లేం సాధించగలదు? వేణు తనను ప్రేమిస్తున్నాడు. అతన్ని పెళ్లి చేసుకుంటుంది. అతను సినీరంగానికి పరిచయం చేస్తానంటున్నాడు. అప్పుడు తను అందాలతార అవుతుంది. అప్పుడు తనకు ప్రపంచం జోహారు చేస్తుంది.....అని కూడా అనుకుం దామె.

ఆ తరువాత, ఓ నెలరోజులవరకు దశరథ రామయ్యగారింటికి చంద్రశేఖరం రాలేదు. ఆయన పత్రిక ఆఫీసుకు ఫోనుచేసి కనుక్కుంటే శేఖరం ఉద్యోగం మానేసినట్లు తెలిసింది. వెంటనే ఆయన శేఖరం గదిని వెతుక్కుంటూ వెళ్లి కారులో ఇంటికి తీసుకొచ్చారు. "ఏం నాయనా శేఖరం, ఒంట్లో బాగుండడంలేదా?" అంటూ ఆదుర్దా వెలిబుచ్చింది అత్తయ్య. యామిని ముభావంగా ఉంది. దశరథరామయ్య గారు భోజనాలవద్ద—"శేఖరం, ఇంక నువ్వు బయట ఉండడానికి వీల్లేదు"...అంటూ "ఆ అన్నట్లు, ఆ సంగతి తరువాత మాట్లాడుకుందాం గాని ఇవాళ అంతా సినిమా కెళదాం" అన్నారు. యామిని ఏదో అనబోయి ఊరుకుంది. భోజనాలైన తరువాత బయల్దేరేముందు గుర్తుకొచ్చింది దశరథరామయ్యగారికి, ప్రొద్దున్న ఓ క్లబ్బు మిత్రుడు కారు పట్టుకుపోయినట్టు. "సరే. ఇంకా టైముంది. థియేటర్ దగ్గరే గదా.కాసేపు నడుద్దాం నాన్నా" అంది యామిని.

"ఏమోయ్ రిక్షాలు మాట్లాడుదామా" అన్నారు దశరథరామయ్యగారు శేఖరం వంక తిరిగి. "పదండి కాసేపు నడుద్దాం" అన్నాడు శేఖరం. "సరే. అంతా నడుద్దామంటే నేనేనా సుఖానికి అలవాటుపడినవాణ్ణి? పదండి" అన్నా రాయన.

దారిలో అప్పుడప్పుడు ఆయన మాట్లాడుతూ నవ్వించడం తప్ప ఎవరూ ఏం మాట్లాడలేదు. థియేటర్ ఇంకా ఓ రెండు వందల గజాల దూరం ఉండగానే రోడ్డు దాటవలసివచ్చింది. కొత్త చిత్రం కావడంవలన రద్దీ చాలా విపరీతంగా ఉంది. రోడ్డు దాటడానికి వీలుచూసుకునేసరికి ఓ పావుగంట అయిపోయింది. ఇంక చూస్తూ ఊరుకుంటే లాభం లేదని ఒక్కొక్కరూ దాటడానికి ప్రయత్నించారు.



అంబపలుకు, జగదంబ పలుకు !

చిత్రం—కె. ధర్మారావు (మద్రాసు—17)

చివర యామిని ఉండిపోయింది. ఆమె దాటడానికి ప్రయత్నిస్తూండగా ఒక్క ఉదుటున ఓ మోటార్ సైకిల్ ఆమెను ఢీకొనడం, ఆమెను అంతలోనే ఎవరో బలంగా పక్కకు లాగడం, ఆమె అరిచి పడిపోవడం, మోటార్ సైకిల్ ముందుకు ఉరికి వెళ్లిపోవడం రెప్పపాటులో జరిగిపోయింది.

"అమ్మా, యామినీ!" అన్న తల్లి పిలుపుకు బరువుగా, బాధగా కళ్లెత్తి చూసింది యామిని ఇంట్లో తన గదిలో. తండ్రి, తల్లి, తండ్రి స్నేహితులు ఆమె మంచం చుట్టూ మూగి ఉన్నారు. ఆమె తలమీద, కాళ్లమీద కట్లు తెల్లగా కనబడ్డాయి. బాధగా, బలహీనంగా కళ్లు మూసేసింది యామిని. సన్నగా వినబడుతున్నాయి తండ్రి మాటలు: "శేఖరం లేకపోతే నా బిడ్డ నాకు దక్కేది కాదండి." అమ్మ ఏడుస్తూ అంటూంది: "ఏమండీ, శేఖరం చెయ్యి తీసివేయక తప్పదంటున్నాడా, డాక్టర్?"—అని.

బావకు చెయ్యి తీసివేయడమా, తనను రక్షించినందుకు? యామిని గొణుక్కుంటూ స్పృహ కోల్పోయింది. యామిని తిరిగి స్పృహ

# విలువలు

లోకి వచ్చాక తండ్రిని చేతితో పిలిచి అడిగింది బావను గురించి. "ఫర్వాలేదమ్మా, డాక్టర్లు ప్రయత్నిస్తున్నారు" అన్నా రాయన తల గోడ వైపు త్రిప్పి.

యామిని పసిపిల్లలా వెక్కివెక్కి ఏడుస్తూంది. కళ్లు ఎర్రబడిపోయినై. అప్పుడప్పుడు పిచ్చిచూపులు చూస్తూంది. తనెంత పాపిష్టిది! బావహృదయం తెలిసికోలేకపోయింది. బావను క్షమించమని ఎట్లా అడగాలి? ఆమె తన గతప్రవర్తనను తిట్టుకుంది. పక్కమీద పొర్లిపొర్లి ఏడ్చింది. అమ్మ, నాన్న గదిలో లేనప్పుడు అరిచేది. బావ హృదయాన్ని తను హింసించింది. తన పాపానికి పరిహారం లేదు. బావ తనను చూడడానికి వస్తే లేదని చెప్పమనేది. అతనెంతో ప్రేమగా తన చిత్రలేఖనాలు చూపడానికి వస్తే తీరిక లేదు, వెళ్లిపోవాలి అనేది తను. తను శపిస్తే, బావ తనకు జీవితాన్నిచ్చాడు. అటువంటి హృదయాన్ని తిరిగి తను ఎట్లా సంపాదించుకోగలదు? బావ ఆస్పత్రిలో ఉన్నాడట. వెళ్లాలి. బావను రక్షించుకోవాలి. అతనికి జీవితాంతం సేవచేసి అతని హృదయంలోని గాయాలను మాన్పాలి. అప్పటినుండి ఆమె ఆస్పత్రికి వెళ్లి బావను ఎప్పుడు చూస్తానా, ఎప్పుడు క్షమించమని అడుగుతానా అని ఆత్రుతగా ఉండేది. యామినికి పూర్తిఆరోగ్యం చేకూరేప్పటికి రెండు నెలలు పట్టింది. బయటకు వెళ్లవచ్చు నన్నాడు డాక్టర్.

ఆవేళ సాయంకాలం దశరథరామయ్యగారు యామినిని ఆస్పత్రికి తీసుకువెడతామన్నారు. నిమిషాలు గడుస్తున్నకొద్దీ యామినిలో సహనం ఇగిరిపోతూంది. ఎప్పుడు వెడతానా, ఎప్పుడు బావ కాళ్లపై పడతానా అని ఆమె ఎదురు చూస్తూంది. దశరథరామయ్యగారు ఇప్పుడే వస్తానని ఎవరికో స్వాగతం ఇవ్వడానికి స్టేషన్ కెళ్లారు. యామిని బట్టలువేసుకుని తండ్రికోసం ఎదురు చూస్తూ, మేడ దిగి హాల్లోకి వచ్చి కూర్చుంది. మొక్కలకు నీళ్లు పోయడానికి వెడుతున్న వెంకన్న ఆమెను చూసి, "అమ్మగోరూ, శేఖరం బాబు మీకీ చీటీ ఇమ్మన్నారండి" అని ఓ కాగితం ఇచ్చాడు. ఆమె ఆత్రుతతో మడతవిప్పి చూసింది.

"యామినీ,

మొదటినుండీ నేను అదృష్టవిహీనుణ్ణే. అది తలిదండ్రులను కోల్పోవడంతోనే ప్రారంభమైంది. 'జీవితం' అంటే—'యామిని, నేను; నృత్యం, చిత్రకళల కలయిక' అనుకునే నాకు నిజమైన నిర్వచనం నువ్వు చెప్పేవరకూ తెలీదు. అందుకు నేను నిన్నేమీ అనలేను. అవును—నేను ఏమంత అందగాణ్ణని, అదృష్టవంతుణ్ణని, సుఖపెట్టడం చేతయినవాణ్ణని నువ్వు నన్ను ప్రేమించగలవు? తప్పు నాలోనే ఉంది. కావలసినదానికంటే ఎక్కువ జీవితంనుండి పిండుకోవాలని నేను దురాశకు పోయాను.

నీవు నృత్యభారతివి. కళకే గర్వకారణమైన దానివి. నీనుండి కళారంగం, భారతదేశం ఎంతో ఆశిస్తున్నది. కృషి మానివెయ్యకు.

ఇంక, నేను నిన్ను రక్షించిందేమీ లేదు. ఆ స్థితిలో ఎవరున్నా అపనే చేస్తారు. ఒకనెల క్రితం నన్నీ ప్రపంచంలో ఇంకా ఉండమని శాసిస్తూ డాక్టర్ ఓ చెయ్యి తీసివేసి బ్రతికించారు. ఇప్పుడు నేను చిత్రకళకు, నిన్ను చూడడానికికూడ అనర్హుణ్ణే. కాని, యామినీ, నాకు కళ్లూ, చెవులూ ఇంకా మిగిల్చాడు దేవుడు. నీ నృత్యప్రదర్శనను ఓమూల ఉండి చూస్తాను; నీ పాదాల గజ్జెలరవళి వింటాను. బ్రతికినంతకాలం నిన్ను చూడకుండా ఉండటం నాతరం కాని పని అయిపోయింది. కనీసం అందుకోరకైనా ప్రదర్శనలు ఇస్తూ ఉంటావు కదూ........

చివరిసారిగా, చిన్నతనంనుండి తలిదండ్రులు లేని లోటుతీర్చిన మామయ్యకు, అత్తయ్యకు నా కృతజ్ఞత తెలియపరచు.

ఇట్లు

నీ శ్రేయోభిలాషి,

చంద్రశేఖరం...."

కళ్లు మూసుకుని, పెదాలు నొక్కుకుంటూ పట్టు తప్పిపోతున్న పాదాలను నిల్రదొక్కుకుంటూ "ఎవరిచ్చారీ చీటీ వెంకన్నా" అంది యామిని — ఇంక ఆపుకోలేక బిగ్గరగా ఏడుస్తూ.

"శేఖరంబాబుగారు వచ్చి యిచ్చారమ్మా."

'పైకి ఎందుకు తీసుకురాలేదురా?'' అని అరిచి సోఫాలో కూలిపోయింది యామిని.

"మీ రేగదమ్మా, శేఖరంబాబుగా రొస్తే లేరని చెప్పమన్నారు ఇదివరకు" అన్న వెంకన్న మాటలు ఆమెకు వినబడ్డాయో, లేదో..... ★

ఉబ్బసమునకు,
పట్ని బొంకోలో (పౌడరు)
దగ్గు-ఆయాసమును అతిశీఘ్రముగా నివారించును
అన్నిమందుల షాపులలో దొరకును
బెంగాల్ ప్రైవేటు లిమిటెడ్, కలకత్తా
శ్రీ వెంకటేశ ట్రేడర్సు,
గోపాలరెడ్డిరోడ్డు... విజయవాడ-2.


## పూవు మీ అదృష్టం చెప్పగలదు

నీ భవిష్యత్తులో ఏమి జరగబోతున్నదిన్నీ, నీ సరియైన చర్యను గురించిన్నీ నీవు తెలుసుకొన గోరినట్లయితే ఒక పోస్టుకార్డుపైన నీకు ఇష్టమగు ఒక పుష్పము పేరున్నూ, నీవు వ్రాయు తేదీ, వేళ వివరములున్నూ, నీ సరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసి పంపుము.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి నీవు కార్డు వ్రాసిన తేదీ లగాయతు 12 మాసములలోని నీ యొక్క అదృష్టము, లాభనష్టములు, జీవిత మార్గము, ఏ వ్యవహారములో నీకు జయము కలుగునో, నీ ఉద్యోగం విషయంలో మంచి చెడ్డలు, మార్పులు, ఆరోగ్య విషయము, పరదేశ గమనము, తీర్థయాత్రలు వివాహము, స్త్రీ సుఖము, సంతానము, నిధి నిక్షేపములు, లాటరీ, ఆకస్మాత్తు ద్రవ్య లాభము మొదలగు వానిని గురించి స్పష్టంగా మాసవారీగా వ్రాసి రు. 1—4—0 లకు మాత్రము వి. పి. గా పంపగలము. వి. పి. చార్జీలు ప్రత్యేకం. దుష్టగ్రహము లేవయినా వున్న యెడల శాంతిచేయు విధానం కూడా తెలుపగలము. వివరములు వాపూచేపైన పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల పైకం వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

**Pt. Dev Dutt Shastri, Raj Jyotishi (AW-3) Jullundur City**